06ATP27_06ATP27.qxd 30-08-2023 PM 10:29 Page 1



# ఘనంగా పరిటాల రవీంద్ర జయంతి

**- అన్నదానం చేపట్టిన తేదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత**



పరిటాల రవీంద్ర చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సవిత

**పెనుకొండ, ఆగస్టు 30 ప్రభాతవార్త :** దివంగత నేత తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ మంత్రి పరిటాల రవీంద్ర జయంతి వేడుకలు తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సునీత ఆధ్వర యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణం లోని సవిత కార్యాల యంలో పరిటాల రవీంద్ర చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సవిత ఆధ్వర్యంలో చేపట్టిన అన్నాక్యాంటీ న్‌లో పరిటాల రవి జయంతి సందర్భంగా పేదలకు ఉచత అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాధవ నాయుడు, మాజీ జడ్పిటిసి వెంకటరమణ, రాంపురం సర్పంచు శ్రీనివాసులు, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు డివి ఆంజినేయులు, మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు డివి ఆంజినేయులు, మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు, గుట్టూరు మాజీ సర్పంచు సూర్యనారాయణ, మాజీ సర్పంచు నంజప్ప, గుడిపల్లి మాజీ సర్పంచు రంగప్ప, కురుబవాండ్లపల్లి మాజీ సర్పంచు సోము, రామకృష్ణరెడ్డి, త్రివేంద్ర నాయుడు, మాజీ వైస్ సర్పంచు సుబ్రహ్మణ్యం, పెద్దపల్లి శ్రీరామ్‌రెడ్డి, మారుతిప్రసాద్, సనావుల్లా, దాదు ఫయాజ్, కౌన్సిలర్ గీతా హనుమంతు, గొల్లపల్లి చంద్ర, వాసుదేవరెడ్డి, ముత్యాలయాదవ్, మద్దిలేటి, రాము ప్రశాంత్, రాజేష్, మూర్తి పాల్గొన్నారు.



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

# సేవా కార్యక్రమాలతో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు జరపాలి

**- చిలకం మధుసూధనరెడ్డి పిలుపు**



చిలకం మధుసూధనరెడ్డి

**ధర్మవరం టౌన్, ఆగస్టు 30 ప్రభాతవార్త :** జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు సెప్టెంబర్ 2న సామాజిక సేవా కార్యక్రమాలతో వేడుకగా జరపాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూధనరెడ్డి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. నిర్దేశించిన సేవా కార్యక్రమాలతో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆయన ఉమ్మడి అనంతపురం జిల్లాలకు చెందిన పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, మండల అధ్యక్షులు, వీర మహిళలు, నాయకులు, కార్యకర్తలకు సూచించారు. భవన నిర్మాణ కార్మికులతో సహపంక్తి భోజనం చేయడం, పారిశుధ్య కార్మికుల (రెల్లి) కాలనీలను సందర్శించుట, రక్తదాన శిబిరాల నిర్వహణ, బడుగు బలహీన వర్గాలకు చెందిన వసతి గృహాల సందర్శన, విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, తదితర అవసరమైన విద్యా సామాగ్రి పంపిణీ, దివ్యాంగులకు అవసరమైన వస్తువులను పంపిణీ చేయాలని ఆయన సూచించారు. ఆయా ప్రాంతాలలో స్థానిక పరిస్థితులను బట్టి ఈ సేవా కార్యక్రమాలను విధిగా నిర్వహించాలని ఆయన కోరారు. ఈ వేడుకలకు వీలైనంత ఎక్కువమంది స్థానికులను ఆహ్వానించాలని ఆయన కోరారు.

# పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలపడానికి 500 కిలోమీటర్లు - సైకిల్ యాత్ర



యాత్ర చేస్తున్న నటుడికి శుభాకాంక్షలతో సన్మానం

**అగళి, ఆగస్టు 30 ప్రభాతవార్త :** మండలానికి సరిహద్దులో ఉన్న కర్ణాటక రాష్ట్రం శిరా పట్టణంలో పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలపడానికి సైకిల్ ద్వారా 500 కిలోమీటర్లు వస్తూ శిరలో ఆగిన కన్నడ నటుడు రూరల్ అంజన్నకు అంతరాష్ట్ర బోయ వాల్మీకి సంఘం అధ్యక్షులు మంజు నాథ్, సత్యసాయి జిల్లా బోయ వాల్మీకి సంఘం ఉపాధ్యక్షులు రమేష్, రంగనాథ్, అజయ్, రాజు అనే వారు పాదయాత్రగా వస్తున్న నటుడు అంజన్నకు గజమాలతో సత్కరించారు. ఈ పాదయాత్ర కర్ణాటక రాష్ట్రం హుబ్లీ నుంచి సైకిల్ ద్వారా బెంగుళూరుకు 500 కిలోమీటర్లు పాదయాత్ర చేసి మరో నటుడు సుదీప్‌కు సెప్టెంబర్ 2వ తేదిన పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలపడానికి ఈ విధంగా వెల్లడం ఆశ్చర్యాన్ని కల్పించింది. ఒక నటుడు మరో నటుడుకి శుభాకాంక్షలు తెలపడానికి ఇలా సైకిల్ ద్వారా పాదయాత్ర చేసుకుంటూ వెళ్తున్న హీరోను సన్మానించడం సంతోషంగా ఉందని వారిని కలిసిన అభిమానులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

# మన దేవాలయం.. మన హక్కు

**- మూడవ రోజు సంతకాల సేకరణ**



సంతకాలు సేకరిస్తున్న బిజెపి నాయకులు

**పెనుకొండ, ఆగస్టు 30 ప్రభాతవార్త :** హిందూ దేవాలయాల పాలక మండల్లో అన్యమతస్తులు, నింధితులను నియమించడాన్ని నిరసిస్తూ బిజెపి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ మూడో రోజుకు చేరుకుంది. పట్టణంలోని ఊరు వాకిలి ఆంజినేయస్వామి, వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ.. తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్, కమిటీ మెంబర్లను ఉన్నతమైన వ్యక్తులను నియమించాలన్నారు. హిందువులనే చైర్మన్‌గా నియమించాలని వారు డిమాండ్ చేశారు. అన్యమస్తులను కమిటీ ఉద్యోగులలో పెట్టడం వల్ల మనోభావాలను దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను కాపాడాలని, అలిపిరి నుంచి మెట్ల మార్గంలో వెళ్లే భక్తులకు పూర్తిగా రక్షణ కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఎనుమల రామకృష్ణ, జిల్లా ఫైనాన్స్ కమిటీ చైర్మన్ రామాంజినేయులు, అసెంబ్లీ కో కన్వీనర్ రవి, మండల అధ్యక్షులు సుభాష్‌చంద్రబోస్, ప్రధాన కార్యదర్శి మధుసూధన్, ముత్యాలమ్మ, హనుమంతు పాల్గొన్నారు.

## రేపు ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడ్డ వాహనాల వేలం

**ఉరవకొండ, ఆగస్టు 30 ప్రభాతవార్త :** ఉరవకొండ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో వివిధ ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాల బహిరంగ వేలం సెప్టెంబర్ 1వ తేదీన శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉరవకొండ సెబ్ స్టేషన్ ఆవరణంలో జరుగుతుందని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ బి.మారుతీరావు తెలిపారు. ద్విచక్రవాహనాలతోపాటు ఒక కారు కూడా వేలం వేయడం జరుగుతుందని ఆసక్తిగలవారు 3,000 రూపాయలు ధరావత్తు రుసుము చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని ఇన్‌స్పెక్టర్ వివరించారు.

# టీటీడీ పాలకమండలి సభ్యునిగా వై.సీతారామిరెడ్డి నియామకంపట్ల హర్షం

**- ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌కు ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి**



తల్లి లలితమ్మతో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ఆయన సోదరులు

**ఉరవకొండ, ఆగస్టు 30 ప్రభాతవార్త :** తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యునిగా వై.సీతారామిరెడ్డి నియామకంపట్ల ఆయన సోదరుడు వై.శివరామిరెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి విలేఖరులతో మాట్లాడుతూ ఎల్లారెడ్డి గారి భీమరెడ్డి కుమారులమైన తమ ఐదు మందికి ప్రజాసేవ చేయడానికి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రికు ఎల్లపుడూ కృతజ్ఞతగా ఉంటామన్నారు. తమ సోదరులలో పెద్దవాడైన వై.సీతారామిరెడ్డిను తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలిలో సభ్యత్వాన్ని ఇవ్వడం తమకు ఎంతో సంతోషానిచ్చిందన్నారు. తమ సోదరులలో గుంతకల్లు ఎమ్మెల్యేగా వై.వెంకట్రామిరెడ్డి, ఆదోని ఎమ్మెల్యేగా వై.సాయిప్రసాద్‌రెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యేగా వై.బాలనాగిరెడ్డి, ఉమ్మడి అనంతపురం జిల్లా ఎమ్మెల్సీగా తాను కొనసాగుతున్నామన్నారు. మా సోదరులమందరం సీయం వై.ఎస్.జగన్ అడుగుజాడల్లో నడుస్తూ ప్రజలకు మరింత చేరువై ప్రజాసేవలో మమేకం అవుతామన్నారు. ఇదివరకు దివంగత సీయం వై.ఎస్.రాజశేఖరరెడ్డి అడుగుజాడల్లో నడిచామని ఇప్పుడు ఆయన తనయుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ అడుగుజాడల్లో నడుస్తూ ముందుకెళుతున్నామన్నారు.

# పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని మరవొద్దు..!

**- మానవ హక్కుల కమిషన్ జాతీయ ఉపాధ్యక్షులు డా॥భాస్కర్‌నాయుడు**



విద్యార్థులతో మాట్లాడుతున్న మానవ హక్కుల కమీషన్ జాతీయ ఉపాధ్యక్షులు డా॥భాస్కర్‌నాయుడు

**ఉరవకొండ, ఆగస్టు 30 ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణ మనందరి భాధ్యతని దీన్ని ఎవరూ విస్మరించరాదని ప్రముఖ పర్యావరణవేత్త, అంతర్జాతీయ మానవ హక్కుల కమీషన్ జాతీయ ఉపాధ్యక్షులు డా॥భాస్కర్‌నాయుడు అన్నారు. జై కిసాన్ ఫౌండేషన్ ఆహ్వానం మేరకు బుధవారం ఆయన ఉరవకొండలో పర్యటించి పలు విద్యాసంస్థలను సందర్శించి విద్యార్థులు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, ఉపాధ్యాయులతోపాటు జై కిసాన్ సర్వీస్ స్టార్స్‌తో ఇష్టాగోష్టి నిర్వహించారు. స్థానిక ఉషోదయ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణంలో మహాత్మా జూనియర్, డిగ్రీ కళాశాలలు, ఉషోదయ పాఠశాల సంయుక్తంగా ఏర్పాటు చేసిన 'పర్యావరణ పరిరక్షణ' అనే అంశంపై అవగాహన కార్యక్రమంతోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్.కె.ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాలకు డా॥భాస్కర్‌నాయుడు తోపాటు జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేష్ ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డా॥భాస్కర్‌నాయుడు మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో చెట్లను నరకవద్దని అడవులను సంరక్షించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలునాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. చెట్లు మన నుంచి ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా ఉపయోగపడుతున్నాయని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. ఫారెస్టులో ఎఫ్ అంటే ఫుడ్, ఓ అంటే ఆక్సిజన్, ఆర్ అంటే రైయిన్స్, ఇ అంటే ఎకో సిస్టం, ఎస్ అంటే సాయిల్ అన్జర్వేషన్, టి అంటే టెంపరేచర్ అని వివరించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటగా మహాత్మా విద్యాసంస్థల యాజమాన్యం ఆయన్ను ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో మహాత్మా డిగ్రీ అడ్మినిస్ట్రేటివ్ అధికారి డా॥కె.కె.ప్రసాద్, ప్రిన్సిపాల్ యం.బసవరాజు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హనుమన్న, ఉషోదయ పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ అధికారి యం.జయప్రకాష్, ఎస్.కె.ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం వీరన్న, సెంట్రల్ హైస్కూల్ హెచ్ఎం రాజేశ్వరి, జై కిసాన్ ఫౌండేషన్ ప్రతినిధులు సురేష్, సురేంద్ర, కుళ్లాయి, పురుషోత్తం, శర్మస్, ఆయా విద్యాసంస్థల బోధనా సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



కళాశాల ఆవరణంలో మొక్క నాటుతున్న దృశ్యం

# ప్రభుత్వాసుపత్రిలో నాగుపాము హల్‌ఛల్

**- పట్టడానికి వచ్చిన వక్తికి పాము కాటు**



స్ట్రక్చర్ కింద ఉన్న నాగుపాము

**పెనుకొండ, ఆగస్టు 30 ప్రభాతవార్త :** పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో నాగుపాము హల్‌ఛల్ చేసింది. పాములు పట్టడానికి వచ్చిన ఓ వ్యక్తిని కాటు వేసిన సంఘటన బుధవారంచోటు చేసుకుంది. ఆసుపత్రిలోని ట్రామా కేర్ సెంటర్‌లో నాగుపామును ఆసుపత్రికి సిబ్బంది గుర్తించారు. పామును పట్టేందుకు పట్టణానికి చెందిన రాజు అనే వ్యక్తిని ఆసుపత్రికి పిలిపించారు. ఈ నేపథ్యంలో పాములు పట్టడానికి ప్రయత్నించిన రాజు చేతికి పాము కాటు వేసింది. ప్రథమ చికిత్స అందించిన మెరుగైన వైద్యం కోసం పుట్టపర్తికి తరలించారు. ఆసుపత్రిలో పాటు కలకలం రేపడంతో ఆసుపత్రిలో ఉన్న రోగులు, సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. ఎట్టకేలకు పాము ఇక్కడి నుంచి వెళ్లిపోయింది.

# వెంకటాంపల్లిలో నీటి శుద్ధ ప్లాంటులో మోటారు ఇతర పరికరాల చోరి



నీటి శుద్ధ ప్లాంటును పరిశీలిస్తున్న గ్రామ సర్పంచ్ భూమా కమలమ్మ

**ఉరవకొండ, ఆగస్టు 30 ప్రభాతవార్త :** ఉరవకొండ రూరల్ పోలీస్ సర్కిల్ పరిధిలోని వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి గ్రామంలోని శుద్ధ నీటి ప్లాంటులో బుధవారం తెల్లవారుజామున చోరి జరిగింది. ప్లాంటులోని విద్యుత్ మోటార్లతోపాటు విలువైన ఇతర పరికరాలను దొంగలు ఎత్తుకెళ్లారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోవున్న సమయంలో అప్పటి పార్లమెంటు సభ్యుడు జె.సి.దివాకర్‌రెడ్డి నిధులతో ఈ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేశారు. అయితే వివిధ కారణాలతో ఈ వాటర్ పా ంట్లు గత కొంత కాలంగా వినియోగంలో లేదని సమాచారం. గ్రామ సర్పంచ్ భూమా కమలమ్మ ఉదయం చోరి జరిగిన ప్లాంటును పరిశీలించి ఆరా తీశారు. కాగా చోరీ జరిగిన వాటర్ ప్లాంటుకు సమీపంలోని మరొక బంకులో కూడా దొంగలు వంట గ్యాస్ సిలెండర్ ఇతరత్రా వస్తువులను ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. చోరి విషయం తెలియగానే పోలీసులు గ్రామానికి చేరుకొని ప్లాంటును, బంకును పరిశీలించి వివరాలు సేకరించారు.

# నలుగురు నిందితులకు 3 సంవత్సరాల జైలుశిక్ష, రూ.10వేల వంతున జరిమానా

**- వేధింపుల తాళలేక 2016 డిసెంబర్ 3న వ్యక్తి బలవన్మరణం**

**- తీర్పు వెలువరించిన అనంతపురం ప్రిన్సిపాల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు**

**ఉరవకొండ, ఆగస్టు 30 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కోనాపురం గ్రామానికి చెందిన హరిజన చక్రి ధనుంజయ అనే వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన కేసులో నిందితులుగావున్న కోనాపురం గ్రామానికి చెందిన మీనుగ వన్నూరుస్వామి, మీనుగ వెంకటేశులు, కంబదూరుకు చెందిన మాదిగ నాగరాజు, కొనకొండ్లకు చెందిన జోగుల నాగరాజులకు అనంతపురం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి దీన ఒక్కొక్కరికి 3 సంవత్సరాల జైలు శిక్షతోపాటు 10వేల రూపాయల వంతున జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించారని ఉరవకొండ పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఏ1గావున్న మీనుగ వన్నూరుస్వామి భార్యతో హరిజన చక్రి ధనుంజయ అక్రమ సంబంధం కలిగి వున్నాడని వన్నూరుస్వామితోపాటు మీనుగ వెంకటేశులు, మాదిగ నాగరాజు, జోగుల నాగరాజు నలుగురు హరిజన చక్రి ధనుంజయను వేధించడంతో అతను గత 2016 డిసెంబర్ 3వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని దీంతో మృతుని తల్లి లక్ష్మిదేవి పిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ నగేష్‌బాబు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈక్రమంలో కేసు విచారణకు రాగా ప్రభుత్వం తరపున ఏపీపీ వెంకటరామిరెడ్డి వాదనలు వినిపించగా నిందితులపై అభియోగం నిరూపణ కావడంతో న్యాయమూర్తి దీన వారికి శిక్ష, జరిమానాను విధిస్తూ తీర్పు వెలువరించారని వివరించారు.

# గ్రామాల్లో ఘనంగా పరిటాల రవి జయంతి వేడుకలు



రామగిరిలో కేక్‌కట్ ఏస్తున్న టీడీపీ నాయకులు, అభిమానులు

**రామగిరి, ఆగస్టు 30 ప్రభాతవార్త :** మండలంలో పలు గ్రామాలలో టిడిపి ఆధ్వర్యంలో పరిటాల రవీంద్ర జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన రామగిరి టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకొని సంబరాలు చేసుకున్నారు. అదే విధంగా శ్రీహరిపురం గ్రామంలో పరిటాల రవీంద్ర విగ్రహానికి పూలమాలలు వేసిఘన నివాళులర్పించారు. వీటితోపాటు గరిమేకలపల్లి, తిమ్మాపురం, నసనకోట తదితర గ్రామాలలో కూడా అభిమానులు పరిటాల రవీంద్ర చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ.. పరిటాల రవీంద్ర ఆశయ సాధన కోసం ఆయన అడుగు జాడల్లో నడుస్తామని ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీ ప్రసాద్, తెలుగు యువత అధ్యక్షుడు లింగాశ్రీధర్‌నాయుడు, మాజీ ఎంపిపి పరందామ యాదవ్, మాజీ సర్పంచు శ్రీనివాసులు, నాయకులు పేపర్‌శీన, ముత్యాలప్ప, మల్లికార్జున, వడ్డిసుబ్బు, నగేష్, మురళీ, గణేష్, ఎస్సీ సెల్ పోతన్న, ఎస్.ఆంజినేయులు, చిత్తరంజన్, బలరాజు, అక్కులప్ప, జయచంద్రనాయుడు, సురేష్, పోలేపల్లి ప్రభాకర్, నారాయణ, తిమ్మానాయుడు, వెంకటరాముడు పాల్గొన్నారు.



శ్రీహరిపురంలో పరిటాల రవీంద్ర విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న అభిమానులు

# వివాహ శుభకార్యానికి తాళి కొత్తబట్టలు ఇచ్చిన తెలుగుతమ్ముళ్లు



తాళిబొట్టు కొత్తబట్టలు ఇస్తున్న తెలుగుతమ్ముళ్లు

**మడకశిర ఆగస్టు 30 ప్రభాతవార్త;** మడకశిర నియోజకవర్గ ఇంఛార్జ్ మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆశీర్వాదంతో క్లస్టర్ ఇంఛార్జ్ నాగరాజు, హిందూపురం పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు కోట్ల రంగేగౌడు, క్లస్టర్ ఇంఛార్జ్ కన్నా నరేష్, గుర్రపుకొండ నాగేంద్రలు మండలపరిధిలోని మణూరు గ్రామ పంచాయతీకి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త జయప్ప కుమారుడు నారాయణప్ప వివాహానికి తాళి బొట్టు కొత్తబట్టలు సత్యసాయి జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో మణూరు పంచాయతీ యూనిట్ ఇంఛార్జ్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# వైకాపా నేత క్రషర్ మధు ఔదార్యం



ట్యాంకర్లకు నీటిని పంపింగ్ చేస్తున్న దృశ్యం

**గుత్తి, ఆగస్టు 30 ప్రభాతవార్త :** గుత్తి మున్సిపాలిటీలో భూగర్భజలాలు ఇంకిపోవడం, సత్యసాయి తాగు నీటి పథకం కార్మికులు సమ్మెబాట పట్టడంతో నీటిసరఫరా స్తంభించిపోయింది. ఈ నేపథ్యంలో 19వవార్డు కౌన్సిలర్ కప్పలబండ సుచరితారెడ్డి భర్త వైకాపా జిల్లా నేత క్రషర్ మధుసూదన్‌రెడ్డి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. అనంతపురం రోడ్డులోని తన సొంత బోరు నుండి మున్సిపాలిటీకి నిత్యం 1.50 లక్షల లీటర్ల నీటిని ఉచితంగా అందించేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు బుధవారం ట్యాంకర్ల ద్వారా మున్సిపల్ సిబ్బంది నీటిని తరలించే ప్రక్రియ చేపట్టారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా ప్రజల సంక్షేమం కోసం వారు తీసుకున్న నిర్ణయం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చేపట్టిన తాగునీటి పథకాలు పూర్తి చేసి నీటి ఎద్దడి నివారించేందుకు మున్సిపల్ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# గుంతకల్లులో దస్తావేజులేఖర్ల పెన్‌డౌన్



నిరసన వ్యక్తం చేస్తున్న దస్తావేజులేఖర్లు

**గుంతకల్లు టౌన్, ఆగస్టు 30 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టబోతున్న కార్డ్ ప్రైమ్ 2.0 విధానానికి నిరసనగా బుధవారం దస్తావేజులేఖర్లు, స్టాంప్‌వెం డర్లు పెన్‌డౌన్ పాటించారు. రాష్ట్రవ్యాప్తంగా రెండురోజులపాటు పెన్‌డౌన్ పాటించనున్నట్లు దస్తావేజులేఖర్ల సంఘం అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దస్తావేజులేఖర్లు గోపా సురేష్, శంకరయ్య, ఎన్ఎం రాజు, రామాంజినేయులు, అత్తర్, అన్వర్, జాకీర్, తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతి



వ్యక్తి మృతి చెందిన దృశ్యం

**గుత్తి, ఆగస్టు 30 ప్రభాతవార్త :** పట్టణ శివారులోని బాటసుంకులమ్మ దేవాలయం సమీపంలో బుధవారం ట్రాక్టర్ బోల్తాపడిన సంఘటనలో కర్నూల్‌కు చెందిన డ్రైవర్ మృతి చెందాడు. వివరాలు ఇలా వున్నాయి. అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రమేష్‌గౌడ్ అనే యువకుడు ట్రాక్టర్‌ను నడుపుకుంటూ వస్తుండగా ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీ కొనడంతో ట్రాక్టర్ అదుపుతప్పింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిని అతను మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# వైభవంగా శ్రీరంగనాథస్వామి కళ్యాణోత్సవం



స్వామివారి కళ్యాణం చేస్తున్న దృశ్యం

**గుత్తి, ఆగస్టు 30 ప్రభాతవార్త :** శ్రావణమాసం పురస్కరించుకుని మండలంలోని జక్కలచెరువు గ్రామంలో శ్రీబొలికొండ రంగనాథస్వామి కళ్యాణోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి, అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు గావించారు. అనంతరం శాస్త్రోక్తంగా కళా ్యణం నిర్వహించారు. ఈ కార ్యక్రమంలో మున్సిపల్‌చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, వైకాపా ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి, సోమశేఖరయాదవ్, బేడల వెంకటరాముడు, గురుప్రసాద్‌యాదవ్, కౌన్సిలర్ ఫారుక్, రాజ్, తదితరులు పాల్గొన్నారు.

# డాక్యుమెంట్ రైటర్ల సమ్మె



సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

**గుత్తి, ఆగస్టు 30 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టనున్న కార్డ్ 2.0 ప్రైమ్ విధానాన్ని నిరసిస్తూ బుధవారం రాష్ట్ర వ్యాప్తసమ్మెలో భాగంగా గుత్తిలోని డాక్యుమెంట్ రైటర్లు పెన్‌డౌన్ చేపట్టి సమ్మె పాటించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నూతన విధానం వల్ల రిజిస్ట్రేషన్లుడాక్యుమెంట రూపంలోకాకుండా డిజిటల్ విధానంలో రూపొందించడం వల్ల ప్రజలు ఇక్కట్ల పాలవుతారని తమ ఉపాధి కరువవుతుందని ఆవేదనవ్యక్తంచేశారు. అనంతరం సబ్‌రిజిస్ట్రార్ గురుమూర్తికి వినతిపత్రంఅందజేశారు. ఈకార్యక్రమంలో బండి సత్యనారాయణ, వెంకటరమణ, అనంత, రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# కెకెపాళ్యంలో భవిష్యత్తుకు బాబు షూరిటీ కార్యక్రమం



భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న తేదేపా నాయకులు

**గుడిబండ, ఆగస్టు 30 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కెకెపాళ ం, మోపురుగుండు గ్రామాలలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు భవిష్యత్తుకు బాబు షూరిటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ పరిశీలకులు పార్థసారథిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన తేదేపా మండల నాయకులు, తెలుగు మహిళా నాయకులతోకలిసి ఇంటింటికీ తిరుగుతూ గత తెదేపా ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను చంద్రబాబునాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాలను, మహాశక్తి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, ప్రధాన కార్యదర్శిప్రకాష్, లాయర్ శివకుమార్, జిల్లా వీరశైవ లింగాయత్ అధ్యక్షులు దుర్గేష్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్, క్లస్టర్‌ఇన్‌చార్జ్‌లు లక్ష్మినరసప్ప, భీమరాజు, నాయిబ్రాహ్మణ జిల్లా అధ్యక్షులు రామాంజినేయులు, ఐటిడిపి తాలూక అధ్యక్షులు కాంతరాజు, డాక్టర్ సెల్ కృష్ణమూర్తి, మాజీ ఎంపిటిసిలు రాజేంద్ర కిష్టప్ప, భోజరాజు, పురుషోత్తం, బసవరాజు, నరసప్ప, లాయర్ దివాకర్, గురు, నటరాజ్, రామచంద్ర, వెంకటరమణ, చిత్రశేఖర్, మండల తెలుగు మహిళా కమిటీ అధ్యక్షులు కావేరి, పవిత్ర రుద్రాణి తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిరస్మరణీయుడు పరిటాల రవీంద్ర



పరిటాల రవి జయంతి వేడుకల దృశ్యం

**తాడిమర్రి, ఆగస్టు 30 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర జయంతిని ఆయన అభిమానులు తాడిమర్రిలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన ఆయన అభిమానులు బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై పరిటాల రవీంద్ర చిత్రపటాన్ని ఉంచి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి అభిమానులు ఒకరికొకరు తినిపించుకున్నారు. రాయలసీమ సింహం పరిటాల రవీంద్ర అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ముంటిమడుగు హర్ష, పాపానాయుడు, నిడిగల్లు సర్పంచు నాగభూషణం, రామాపురం రఘు, రామ్మోహన్, గణేష్, పక్కీరరెడ్డి, మురళీ, స్టూడియో రామ్మోహన్, భాస్కర్‌గౌడ్ దుర్గా తదితర వందలాది మంది పాల్గొన్నారు.

# 2న చేపల చెరువు వేలం

**అమరాపురం, ఆగస్టు 30 ప్రభాతవార్త :** అమరాపురం గ్రామ పంచాయతీలో సెప్టెంబర్ 2వతేదీన చేపల చెరువు వేలంపాట నిర్వహిస్తున్నట్లు గ్రామ కార్యదర్శి భాస్కర్ తెలిపారు. కావునా ఆసక్తిగల వారు వేలంపాటలో ఉదయం 11 గంటలకు పాల్గొనవచ్చని ఆయన తెలిపారు.

# ఉపాధిహామీ కూలీల శాతం పెంచండి



మాట్లాడుతున్న అధికారులు

**అమరాపురం, ఆగస్టు 30 ప్రభాతవార్త :** మండలంలోని ప్రతి గ్రామంలో ఉపాధి హామీ సిబ్బంది కూలీల శాతాన్ని పెంచాలని ఎంపిడిఓ మునిస్వామి, ప్రత్యేక అధికారి నరసింహులు తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఎపిఓ గోపాల్ సమక్షంలో బుధవారం టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో ఉపాధి పనులను రైతులకు ఉపయోగపడే విధంగా నిర్వహించి అదే విధంగా కూలీల శాతాన్ని పెంచాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఉపాధి పనులు జరుగుతున్న వివరాలతో పాటు హాజరవుతున్న కూలీల వివరాలు కూడా తెలుసుకున్నారు. ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ విధిగా కూలీల శాతాన్ని పెంచాలని వారు తెలిపారు.

# నిరుద్యోగ యువతీయువకులకు ఉపాధి అవకాశాలు

**పుట్టపర్తి టౌన్, ఆగస్టు 30, ప్రభాతవార్త :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉన్నతి పథకం ద్వారా యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించబడుతాయని జాబ్ కో ఆర్డినేటర్ ఆంజనేయులు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ జాతీయ ఉపాధి హామీ పథకం వందరోజులు పనిచేసిన కుటుంబాల్లో యువతీయువకులకు ఈ పథకం వర్తిస్తుందని, ఇంటర్ పాస్, డిగ్రీ పాస్ లేదా ఫేయిల్ అయిన వారికి ఉచితంగా శిక్షణ ఇచ్చి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజన వసతి సౌకర్యం తో పాటు స్టేఫండ్ ఇవ్వడం జరుగుతుందని ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.

07ATP30_07ATP30.qxd 30-08-2023 PM 11:48 Page 1



## గడపగడపకు కార్యక్రమంలో సాయిప్రతాప్‌రెడ్డి



పథకాలను వివరిస్తున్న సాయిప్రతాప్‌రెడ్డి

**తాడిపత్రిరూరల్, ఆగస్టు 30 ప్రభాతవార్త**

మండలంలోని పెద్దపొలమడ గ్రామంలో బుధవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో యువనాయకులు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళుతూ ప్రజలకు ప్రభుత్వం నుండి అందుతున్న పథకాలను వివరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకున్నారు. అవ్వాతాతలను ఆప్యాయ ంగా పలకరిస్తూ ఫించన్లు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ఎండిపోతున్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

**పుట్లూరు, ఆగస్టు 30 ప్రభాతవార్త**

ప్రస్తుతం వర్షాలు కురవక రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయని ఆ పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు నల్లప్ప పేర్కొన్నారు. వ్యవసాయానికి 9 గంటల విద్యుత్, ఎండిపోతున్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని, ధరల పెరుగదల, నిరుద్యోగ సమస్యలపై ఈ నెల 30 నుండి సెప్టెంబర్ 4వరకు చేపట్టిన సిపిఎం సమరభేరి జీపుజాత బుధవారం మండలంలోని కడవకల్లు గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మరోసారి కరువు పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఈ ఏడాది వర్షాలు రాకపోవడంతో దాదాపు 4 లక్షల ఎకరాల్లో విత్తనాలు వేయలేదన్నారు. వేసిన 5.62 లక్షల ఎకరాల్లో అత్యధికభాగం ఎండిపోతున్నాయన్నారు. దీనికితోడు వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ అమలు కాకపోవడంతో బోర్లలో వున్న నీటి కిందనైనా పంటలు కాపాడుకోవడానికి వీలుకాకుండా పోతోందన్నారు. ఈ పరిస్థితుల్లో వ్యవసాయానికి 9 గంటల విద్యుత్, ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం ప్రభుత్వం ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఆయన తెలిపారు. వ్యవసాయ కూలీలు పనులు కోల్పోయినందున ఉపాధి హామీ పథకం కింద అదనంగా వంద రోజుల పనిదినాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.బాలరంగయ్య, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, పుల్లన్న, మండల కార్యదర్శి సూరి, మండల నాయకులు వెంకటచౌదరి, భాస్కర్‌రెడ్డి, పృథ్వీ, భూషణ్ పాల్గొన్నారు.

## ఓటరు వెరిఫికేషన్ పరిశీలించిన డిఎల్‌డిఒ



జాబితాను పరిశీలిస్తున్న దృశ్యం

**యల్లనూరు, ఆగస్టు 30 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని పాతపేట, కొత్తపేటలోని వార్డుల్లో బుధవారం ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిఎల్‌డిఒ ఓబులమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలు వున్నాయా లేక డెత్ అయిన వారు జాబితాలో వున్నారా అని పరిశీలించారు. అలాగే బిఎల్ఒలకు పలు సూచనలు సలహాలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుమతి, ఇఒఆర్‌డి విజయశేఖర్‌నాయుడు, విఆర్ఒ వినోద్, తదితరులు పాల్గొన్నారు.

## కిడ్స్ కేవ్ స్కూల్‌లో రాఖీపౌర్ణమి వేడుకలు

**తాడిపత్రిఅర్బన్, ఆగస్టు 30 ప్రభాతవార్త**



కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు

తాడిపత్రి పట్టణంలోని కిడ్స్ కేవ్ ఇంటర్ నేషనల్ అండ్ ప్లేస్కూల్‌లో బుధ వారం రాఖీపౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా కిడ్స్ కేవ్ స్కూల్ కరస్పాండెంట్ సోముల అనితారెడ్డి మాట్లాడుతూ రాఖీ పండుగ ఎంతో పవిత్రమైందన్నారు. సోదరీమణుల పట్ల సోదరులు ఎలా మెలగాలన్నది రక్షాబంధన్ తెలియచేస్తుందన్నారు. ఆపద సమయాల్లో ఆదుకునేది అన్నదమ్ములు మాత్రమేనని ఇలాంటి రాఖీ పండుగ జరుపుకోవడం చాలా సంతోషంగా వుందని ఆమె తెలియచేశారు. అదేవిధంగా పాఠశాలలోని పలువురు చిన్నారుల పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బోనస్, వేతనాల సమస్య పరిష్కారం - ఎస్ఐ



కార్మికులతో మాట్లాడుతున్న ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి

**యాడికి, ఆగస్టు 30 ప్రభాతవార్త**

మండలంలోని బోయరెడ్డిపల్లి గ్రామంలో వున్న పెన్నా సిమెంట్ ఫ్యాక్టర్ వద్ద ఒప్పంద కార్మికులు తమకు రావాల్సిన జీతాలు, బోనస్ గురించి నిరసన వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి హుటావుటిన అక్కడికి చేరుకుని ఫ్యాక్టరీ యాజమాన్యంతో కార్మికుల సమస్యలను తెలియచేశారు. అనంతరం యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరించినట్లు ఎస్ఐ తెలిపారు. కార్మికులు తమ సమస్య పరిష్కారమైనందుకు నిరసన విరమించి యాజమాన్యానికి, పోలీసు అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## విశ్వప్రేమకు చిహ్నం రక్షాబంధన్

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 30 ప్రభాతవార్త**

అనంతపురంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న ఏటిపి-8లో రక్షాబంధన్ జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి రక్షాబంధన్ కార్యక్రమంలో పాల్గొని రక్షాబంధన్ ప్రాముఖ్యత గురించి తెలిపారు. ఈ రక్షాబంధన్ ఒకప్పుడు దుష్టశక్తులను పారదోలడానికి చేపట్టిన కార్యాలు విజయవంతంగా ముగించడానికి ఉద్దేశించి రక్షాబంధన్ అని అనంతర కాలంలో సోదర సోదరీ ప్రేమకు ప్రత్యేకంగా వారిందని ఈ పండుగ కుటుంబ విలువలకు మానవ సంబంధాలను పరిపుష్టి చేస్తుంది. అనేక విషయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నేత్రావతి, అరుణ్, కిరణ్, సి.బ్యాచ్ ఇన్‌చార్జ్ గంగాధర్, కోఆర్డినేటర్ తిరుమలేశ్వర్, ప్రైమరీ ఇన్‌చార్జ్ దేవికృప, ప్రైమరీ ఇన్‌చార్జ్ పాల్గొన్నారు.

## అనాధలకు పూర్వ విద్యార్థుల చేయూత



అనాధలకు విలువైన సామాగ్రిని అందచేసిన పూర్వవిద్యార్థులు

**తాడిపత్రిరూరల్, ఆగస్టు 30 ప్రభాతవార్త**

రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని ఆవులతిప్పాయపల్లి గ్రామంలోని శ్రీరమణమహర్షి అనాధ శరణాలయానికి దాదాపు 50 వేల రూపాయల విలువ చేసే ర్యాకులు, గ్లాసులను యాడికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2001-02 బ్యాచ్ విద్యార్థులు, మిత్ర బృందం ఆశ్రమానికి అందచేశారు. అనాధాశ్రమంలోని సభ్యులు వినాయకచవితి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించుకునేందుకు గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ఆనందంగా నిర్వహించుకునేందుకు 5500 రూపాయలను అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. తమకు ఎవరూ లేరనే భావన లేకుండా ఈ సమాజం మాకు తోడుగా నిలుస్తుందనే ఆశాభావంతో ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గణేష్, వలి, జనా, చంద్రశేఖర్, గంగిరెడ్డి, శివానందరెడ్డి, నారాయణస్వామి, సురేష్, చాంద్‌బాష, రమణ, మల్లికార్జున, గంగరాజు, లాయర్, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ కాలనీలో పర్యటించిన కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి



కాలనీవాసులతో మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

**తాడిపత్రిఅర్బన్, ఆగస్టు 30 ప్రభాతవార్త**

పట్టణంలోని సిపిఐ కాలనీలో బుధవారం యువనాయకులు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలోని వారి యోగక్షేమాలు, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని వీధుల్లోకి చెత్తబండి రావడం లేదని, మరి కొన్ని చోట్ల రోడ్లు కావాలని ప్రజలు కోరారు. వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు కోశాధికారి దూదేకుల బాబయ్య, మాజీ కౌన్సిలర్ బట్టా రాజన్న, హరినాథ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, మస్తాన్‌వలి, కిరణ్‌కుమార్, కమలాకర్, నాగేశ్వర్‌రెడ్డి, తదితర వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా



ట్యాంకర్లతో ప్రజలకు నీరు సరఫరా చేస్తున్న దృశ్యం

**యాడికి, ఆగస్టు 30 ప్రభాతవార్త**

మండలంలోని రామరాజుపల్లి గ్రామంలో బుధవారం సర్పంచు తలారి అరుణ ఆధ్వర్యంలో తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేశారు. వేతనాల సమస్యల వల్ల శ్రీసత్యసాయి తాగునీటి పథకం సిబ్బంది గత వారం రోజుల నుండి నిరసన తెలియచేస్తూ విధులకు హాజరు కానందువల్ల నీటి సరఫరా కాలేదని గ్రామ ప్రజలు తెలిపారు. దీంతో ప్రజల ఇబ్బందులను దృష్టిలో వుంచుకుని ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు తలారి నాగేష్ పేర్కొన్నారు. దీంతో రామరాజుపల్లి గ్రామస్తులు సర్పంచుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులకు నగదు పురస్కారం

**యాడికి, ఆగస్టు 30 ప్రభాతవార్త**



మాట్లాడుతున్న దృశ్యం

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గత 10వ తరగతి పరీక్షల్లో 537 మార్కులు సాధించిన సుస్వాగత్‌కు ప్రథమ బహుమతి కింద 8 వేల రూపాయలు, 528 మార్కులు సాధించిన రమేష్ అనే విద్యార్థికి 6 వేల రూపాయల నగదు పురస్కారాలతో పాటు ప్రశంసాపత్రాలను అందచేశారు. ఈ కార్య క్రమంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షులు కత్తి లక్ష్మినారాయణరెడ్డి, వీరారెడ్డి, ఆదినారాయణస్వామి, కుళ్లాయిరెడ్డి, అశ్వర్థరెడ్డి, సేతు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహానికి వంట పాత్రల వితరణ



వంట పాత్రలను అంద చేస్తున్న దృశ్యం

**యాడికి, ఆగస్టు 30 ప్రభాతవార్త**

మండలంలోని రాయలచెరువు గ్రామ సమీపంలోని ఏపి ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహానికి బుధవారం రాయలచెరువు గ్రామానికి చెందిన ఫ్యాక్టరీ యజమాని సుంకర రమణ మిక్సీతో పాటు వంటపాత్రలను అందచేశారు. ఏపి ఆదర్శ పాఠశాల వసతి గృహానికి మరింత మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో తాము వీటిని అందచేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మారుతి, తూట్రాళ్లపల్లి గ్రామ సర్పంచు సంజీవరాయుడు, నాగేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు





శ్రీసత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

**యాడికి, ఆగస్టు 30 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని శ్రీవాసవిమాత ఆలయంలో బుధవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రావణపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సామూహిక శ్రీసత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహించారు. దాదాపు 20 మంది దంపతులు ఈ వ్రతంలో పాల్గొన్నారు. అదేవిధంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యం



విత్తన కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

**కదిరి, ఆగస్టు 30, ప్రభాతవార్త**

రైతుల సంక్షేమమే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం అని కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి పేర్కొన్నారు. జిల్లా కులముల సేవా సహకర సంఘం లిమిటెడ్ అనంతపురం వారి ఆధ్వర్యంలో వంద శాతం రాయితీతో కదిరి నియోజకవర్గ షెడూ ్యల్డ్ కులముల రైతులకు విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి కదిరి ఎమ్మెల్యే, జిల్లా అగ్రి బోర్డు ఛైర్మెన్ రమణారెడ్డిలు హాజరై రైతులకు సేంద్రియ వ్యవసాయ కిట్లను, వ్యవసాయానికి అవసరం అగు యంత్రాలను పంపిణీ చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 91 మంది రైతులకు రూ 10 వేలు విలువచేసే విత్తనాలను అందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఎంపిపిలు, జడ్పిటిసిలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, ఏడి సత్యనారాయణ, ఎంపిడిఓ అంజినప్పలు పాల్గొన్నారు.

## నాయక్‌నగర్ కొరకు స్థలాన్ని ఏర్పాటుచేయాలి

**కదిరి, ఆగస్టు 30 ప్రభాతవార్త**



ఆర్డిఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కదిరి గ్రామ పొలం సర్వే నెంబర్ 1784-2, 4లలో 60 సెంట్ల ప్రభుత్వ స్థలం ఉందని, ఆ స్థలం నాయక్‌నగర్ కొరకు ఏర్పాటు చేయాలని బుధ వారం ఆర్డిఓ రాఘవేంద్రకు బంజారా సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. కదిరి చుట్టుపక్కల పెద్ద ఎత్తున తాండాలు ఉన్నాయని, జీవనోపాధి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వ స్థలం ఏర్పాటు చేసి బంజారులకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్య క్రమంలో నాయకులు కృష్ణ నాయక్, శ్రీనివాసులునాయక్, రామ్‌ప్రసాద్ నాయక్, ఆనంద్, సేవేనాయక్, చంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పౌర్ణమి వేడుకలు



పౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్న అధ్యక్షులు దాదెం శివారెడ్డి

**నల్లచెరువు, ఆగస్టు 30, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని గీతామందిరం నందు శ్రీకృష్ణుడికి పౌర్ణమి సందర్భంగా ఆలయ అధ్యక్షుడు దానం శివారెడ్డి ఆధ్వర్యంలో పౌర్ణమి వేడుకలను ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యం స్వామి, సురేష్‌శర్మ ఉదయం శ్రీకృష్ణుడికి అభిషేకాలు, మంగళస్నానాలు,గంధం, కుంకుమ, ప్రత్యేక పుష్పాలతో అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం శ్రీకృష్ణ సంకీర్తనలు, భజనలుతో భక్తులు విరివిగా పాల్గొని భక్తిశ్రద్దలతో పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలపాటిదిన్నె ఆలయ చైర్మెన్ దేవిరెంటి భాస్కర్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి,బూచిపల్లి నరసింహారెడ్డి, రామారావు,మనీ పాల్గొన్నారు.

## శాప్ క్రీడల్లో టెక్ విద్యార్థిని ప్రతిభ

**తాడిపత్రిరూరల్, ఆగస్టు 30 ప్రభాతవార్త**



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

జాతీయ క్రీడల దినోత్సవాన్ని పురస్కరించుకుని శాప్ వారు నిర్వహించిన క్రీడల్లో తాడిపత్రి టెక్ జూనియర్ కళాశాల విద్యార్థిని పి.గౌతమి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచినట్లు కళాశాల కరస్పాండెంట్ అశోక్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రత్యూష మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న బొమ్మనశ్రీరామిరెడ్డి



నూతన వధువరులను ఆశీర్వదిస్తున్న దృశ్యం

**శింగనమల, ఆగస్టు 30 ప్రభాతవార్త**

మండల పరిధిలోని నాగలగుడ్డం గ్రామానికి చెందిన వరికూటి రవి స్వరూప వివాహ వేడుక జిల్లా కేంద్రంలోని కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సింగిల్ విండో అధ్యక్షులు బొమ్మనశ్రీరామిరెడ్డి హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. ఆయన వెంట వైఎస్ఆర్‌సిపి నాయకులు సాకే లోకనాథ్, రాముయాదవ్, అంజిన్‌రెడ్డి, రామకృష్ణరెడ్డి, శరత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, డీలర్ వరికూటి ఆదినారాయణ, తలారి అశోక్, గుజ్జల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## బుకింగ్‌లను ప్రారంభించిన టయోటా కిర్లోస్కర్

**అనంతపురం కల్చరల్, ఆగస్టు 30 ప్రభాతవార్త**

టయోటా కిర్లోస్కర్ మోటార్, అధికారికంగా బుకింగ్ ప్రారంభాన్ని దాని తాజా ఆఫర్ పూర్తి సరికొత్త టొయోటా రూమియన్ ధరలను ప్రకటించింది. దీనిని ఆగస్టు 23 నెల ప్రారంభంలో విడుదల చేశారు. ఇది వినియోగదారుల నడుమ పూర్తి ఉత్సాహాన్ని కలిగిస్తుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఆరు గ్రేడ్లలో అందుబాటులో ఉన్న ఈ అసాధారణమైన కొత్త కాంపాక్ట్ బి.ఎంపివి దాని సాటిలేని స్థలం, సౌకర్యం, అద్భుతమైన ఇంధన సామర్థ్యం, ఆకర్షణీయమైన ప్రీమియం బాహ్య డిజైన్ కొత్త ప్రమాణాలను నిర్దేశిస్తుందని భావిస్తున్నారు. కస్టమర్లు ఇప్పుడు పూర్తి సరికొత్త టొయోటా రూమియను రూ.11,000 టోకెన్ మొత్తానికి తమ సమీప డీలర్ అవుట్లెట్లో అలాగే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచుచ. అన్ని టొయోటా ఉత్పత్తులను కలిగి ఉన్న టయోటా యొక్క వర్చువల్ షోరూమ్, తాజా ఆవిష్కరణల సమగ్ర వీక్షణను అందిస్తుంది. కస్టమర్లు అత్యంత సౌకర్యంగా కేవలం ఒక క్లిక్‌తో వేరియంట్లు రంగులు ముఖ్య లక్షణాలను అన్వేషించడానికి అనుమతిస్తుంది.

## పల్లె ఉమా వర్ధంతికి భారీగా తరలివెళ్లిన తెలుగు తమ్ముళ్లు

**అమడగూరు, ఆగస్టు 30 ప్రభాతవార్త**



పల్లె ఉమా ఘాట్ వద్ద తెలుగుతమ్ముళ్లు

అనంతపురంలో జరిగిన మాజీ మంత్రి, పుట్టపర్తి టిడిపి నియోజకవర్గం ఇన్‌చార్జ్ పల్లె రఘునాథరెడ్డి సతీమణి పల్లె ఉమా వర్ధంతికి అమడగూరు మండలం నుండి భారీ ఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు బుధవారం తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, హిందూపురం పార్లమెంట్ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, డిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజినేయులు, తెలుగుయువత కృష్ణారెడ్డి, కడప కృష్ణారెడ్డి, రాజు, భాస్కర్, రాజారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కిష్టప్ప, రమణారెడ్డి, కుమార్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, వెంకట్, ఆలకుంట్ల మారెప్ప, పవన్, నంజప్ప, అంజి, లక్ష్మినారాయణ, రమణ, శ్రీనివాసులు, రాము, సుధాకర్‌రెడ్డి, నారాయణ, అంజి, తదితర నాయకులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనంలో జారిపడి మహిళ మృతి

**ఓబుళదేవరచెరువు, ఆగస్టు 30, ప్రభాతవార్త**



మృతురాలు సాయిలీల (ఫైల్ ఫోటో)

మండల పరిధిలోని తొట్లివారిపల్లి సమీపంలో సుబ్బారెడ్డిషెడ్డు వద్ద ద్విచక్ర వాహనంలో వెళ్తూ ప్రమాద వశాత్తు జారిపడి అమడగూరు మండలం జౌకుల కొత్తపల్లి గ్రామానికి చెందిన సాయిలీల(30)అనే మహిళ మృతి చెందినట్లు ఎస్సై గోపి తెలియచేశారు. ఎస్సై గోపి తెలిపిన వివరాల మేరకు నిన్న రాత్రి నాకు ఆరోగ్యం సరిగాలేదు అనంతపురంలో వైద్యం చేయించుకునేందుకు వెళ్లేందుకు వరసకు తమ్ముడు అయిన మంజునాథ్‌ను బుధవారం ఉదయమే ఫోన్‌చేసి చెప్పిందన్నారు. అక్కచెప్పిన విధంగానే మంజునాథ్ తెల్లవారు జామునే జేకేపల్లికి వెళ్లి సాయిలీలను ద్విచక్రవాహనంలో గంగాపురం వస్తుండా ఓడిసి-కుసుమవారి పల్లి రహదారిలోని సుబ్బారెడ్డి షెడ్డ వద్దకు రాగానే కుక్క అడ్డురావడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో సాయిలీల ఎగిరిపడి రాయిమీదపడడంతో అక్కడిక్కడే మృతి చెందిందన్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతురాలు తల్లి గంగులమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం కొరకు కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## ప్రజావేదిక భవిష్యత్తు గ్యారెంటీ రిజిస్ట్రేషన్ శిక్షణా కార్యక్రమానికి తరలిరండి

**నార్పల రూరల్, ఆగస్టు 30 ప్రభాతవార్త**



నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యులు

మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆవరణలో గురువారం జరగనున్న ప్రజావేదిక భవిష్యత్తు గ్యారెంటీ శిక్షణా కార్యక్రమానికి టిడిపి కార్యకర్తలు భారీగా తరలిరావాలని శింగనమల నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డిలు బుధవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కదలిరండి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలా అనే నినాదాన్ని స్మరించుకుని కార్యక్రమానికి సీనియర్ నాయకులు, ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, బూత్ కమిటీ కన్వీనర్లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, టిడిపి ఇన్‌చార్జ్‌లు, వివిధ మాజీ ప్రతినిధులు, అనుబంధ సంస్థల వివిధ పదవుల్లో వున్న నాయకులు హాజరుకావాలన్నారు. అనంతరం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 200 రోజులకు చేరుకున్న సందర్భంగా సంఘీభావం పాదయాత్ర జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని రు.

## సెప్టెంబర్ నుంచి స్వచ్చత పక్వాడ్

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 30 ప్రభాతవార్త**

జిల్లాలోని అన్ని పాఠశాలల్లో రానున్న సెప్టెంబర్ 1వ తేది నుంచి 15వ తేది వరకు స్వచ్చత పక్వాడ్ కార్యక్రమాలను ప్రతిరోజు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఇందుకు సంబంధించి సమగ్ర శిక్ష రాష్ట్ర సంచాలకుల ఆదేశాలను, మార్గదర్శకాలను ఇప్పటికే జిల్లాలోని అందరు మండల విద్యాశాఖ అధికారులకు, ప్రదానోపాధ్యాయులకు, ఉప విద్యాశాఖాధికారులకు పంపడం జరిగింది. ఒకటవ తేది స్వచ్చత శపథ దినోత్సవం మొదలుకుని 15వ తేది విద్యార్థులకు బహుమతులు పంపిణీ వరకు ఆయా తేదీల్లో చేయాల్సిన వివిధ స్వచ్చతా చైతన్య కార్యక్రమాలను మార్గదర్శకాల్లో నిర్దేశించి ఉన్నారు. ఈ మార్గదర్శకాల మేరకు కచ్చితంగా అన్ని పాఠశాలల్లో ఆయా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులను భాగస్వాములను చేసి విద్యార్థులతో కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఆయా కార్యక్రమాల ఫోటోలు, వీడియోలను సంబంధిత లింక్ ద్వారా ప్రతిరోజూ అప్‌లోడ్ చేయాలి. ఈ కార్యక్రమాలు కచ్చితంగా విజయవంతంగా జరిగేలా మండల శిద్యాధికారులు, ఉప విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు పర్యవేక్షించాలని అందులో పేర్కొన్నారు.

## విద్యార్థుల గోడు ప్రభుత్వానికి పట్టదా..

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 30 ప్రభాతవార్త**

జిల్లా వ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈ నెల 23వ తేది నుంచి 30వ తేది వరకు భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర నిర్వహించారు. ఈ సైకిల్ యాత్ర ముగింపు సభను అనంతపురం పట్టణంలోని కెఎస్ఆర్ బాలికల పాఠశాలలో నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్, జిల్లాప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఏడు రోజులపాటు నిర్వహించినటువంటి విద్యార్థి సంఘాల సైకిల్ యాత్ర సందర్భంగా సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ, రాష్ట్ర కమిటీ సభ్యుడు వైటిసి రమేష్, రాష్ట్ర గర్ల్స్ కమిటీ సభ్యురాలు రజిత, జిల్లా గర్ల్స్ కన్వీనర్ సునీత, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు తరిమెల గిరి, సిద్దార్థ వెంకటేష్, శివ, భీమేష్, మాదేష్, నరసింహా, నందన్, హరీష్, వివేక్ పాల్గొన్నారు.

## సాయి విజ్ఞాన్ పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 30 ప్రభాతవార్త**



రాఖీ పౌర్ణమి నిర్వహిస్తున్న చిన్నారులు

స్థానిక 3వ రోడ్డులో ఉన్న సాయి విజ్ఞాన్ పాఠశాలలో రక్షాబంధన్ (రాఖీ పౌర్ణమి) వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇందులో పాఠశాల డైరెక్టర్లు సి.కరుణాకర్‌బాబు, ఎం.పి.శ్రీనివాసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.లావణ్యారామ్ పాల్గొన్నారు. ముందుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. అందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. రక్షాబంధన్ లేదా రాఖీ తోబుట్టువుల మధ్య విడదీయరాని, ప్రత్యేక బంధాలను జరుపుకునే పవిత్రమైన పండుగ ఈ పండుగ ఏటా శ్రావణమాసం పూర్ణిమ తిథి నాడు వస్తుంది అని చెప్పారు. సోదరీమణులు తమ సోదరుడి చేతులకు రాఖీ కట్టి వారి శ్రేయస్సు, దీర్ఘాయువు కోసం ప్రార్థిస్తారని చెప్పడం జరిగింది. పాఠశాలలోని విద్యార్థినిలు కూడా విద్యార్థులకు రాఖీని కట్టి సోదర భావంతో కలిసి మెలసి ఉండాలని చెప్పారు. ఉపాధ్యాయులు కూడా రాఖీ కట్టి ఒకరికి ఒకరు శుభాకాక్షలు తెలుపుకుని ఈ కార్యక్రమాన్ని ముగించడం జరిగింది.

